క్లుప్తంగా

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోండి

కోస్గి రూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు రైతు బీమా కోసం ఈ నెల 13వ తేదీలోగా మండల వ్యవసాయ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కోస్గి డివిజన్ పరిధిలోని కోస్గి, గుండుమాల్, కొత్తపల్లి , మద్దూర్ మండలాలలోని రైతులు జూన్ 5వ తేదీలోపు పట్టా పాస్‌పుస్తకాలు వచ్చిన రైతులు 18 నుంచి 59ఏళ్లలోపు వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే రైతు బీమాలో మార్పు చేర్పులకు ఈనెల 12లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బీఎస్ఎన్ఎల్ సేవలను మెరుగుపరచాలి



కొత్తపల్లి: మండల కేంద్రంలో బీఎస్ఎన్ఎల్ టవర్ ఉన్నా మెరుగైన సేవలు అందించడంలో అధికారులు విఫలమయ్యారని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీఎస్ఎన్ఎల్ టవర్‌కు అదనంగా జియో, ఐడియా, ఎయిర్‌టెల్ సిగ్నల్‌లు అమర్చి నిరంతరాయంగా సేవలు అందిస్తున్నా బీఎస్ఎన్ఎల్ మాత్రం సేవలను అందించడంలో విఫలమవుతున్నట్లు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌ను విస్తరించి నిరంతరాయ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు.

నేడు మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా బైక్ ర్యాలీ

నారాయణపేట రూరల్/నారాయణపేట టౌన్: ప్రగతిశీల యువజన సంఘం ఆధ్వర్యంలో గంజాయి, డ్రగ్స్, మద్యానికి వ్యతిరేకంగా సోమవారం నిర్వహించనున్న బైక్ ర్యాలీ విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ప్రతాప్ సిద్దు ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలో గంజాయి, మత్తు పదార్థాలు ఒకప్పుడు హైదరాబాద్ వరకే పరిమితం అయితే, ప్రస్తుతం గ్రామాల్లోకి స్కూల్, కాలేజీలోకి వచ్చిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి వ్యతిరేకంగా పీవైఎల్ జిల్లా కేంద్రంలో బైక్ ర్యాలీని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నాయీ బ్రాహ్మణులకు క్షమాపణ చెప్పాలి

మరికల్/మద్దూరు/ఊట్కూరు: సోషల్ మీడియాల్లో నాయీ బ్రాహ్మణులను కించపరిచే విధంగా పోస్టులు పెట్టిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని నాయీ బ్రాహ్మణ సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కోటకొండకు చెందిన ఓ వ్యక్తి నోటి దురుసుతో సోషల్ మీడియాలో తమ కులాన్ని దూషించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు వ్యక్తితో తమ సంఘానికి వెంటనే క్షమాపణ చెప్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయిబ్రాహ్మణ మండల కమిటి అధ్యక్షులు రఘు, శివ, శ్రీనివాసులు, వేణు, భీషులు, బాల్‌రాజ్, భాస్కర్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ కమిటీ ఎన్నిక

మాగనూర్: ఎమ్మార్పీఎస్ నారాయణపేట జిల్లా ఇంచార్జి నర్సింహ మాదిగ ఆధ్వర్యంలో వర్కూర్ గ్రామ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా పండుగ సాయన్న, ఉపాధ్యక్షుడిగా కావలి మొగ్గులప్ప, ప్రధాన కార్యదర్శిగా వాబయ్య, గ్రామ ఇంచార్జిలుగా దొబ్బలి గోవిందు, దయాల్ వెంకటప్ప, వెంకటప్ప, అంజప్ప, మ్యాకలి సాయన్న తదితరులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

పట్టణంలో విస్తృతంగా తనిఖీలు



మహబూబ్‌నగర్ క్రైం: స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం డాగ్‌స్క్వాడ్‌తో విస్తృతంగా తనిఖీ నిర్వహించారు. పట్టణంలో క్లాక్‌టవర్, ఆకుల చౌరస్తా, రాంమందిర్ చౌరస్తా, తూర్పు కమాన్, ట్యాంక్‌బండ్ ఏరియాలో ఉన్న హోటళ్లు, దుకాణాలు, పాన్ దుకాణాలలో తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వన్‌టౌన్ సీఐ అప్పయ్య మాట్లాడుతూ దుకాణాల నిర్వాహకులు భద్రత నియమాలు పాటించి, శాంతిభద్రతలకు సహకరించాలన్నారు. స్వాతంత్య్ర దినోత్సవం వేడుకల్లో బైక్‌లను పెద్ద పెద్ద శబ్దాలు చేస్తూ ర్యాలీలు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ తనిఖీల్లో ఎస్‌ఐ శీనయ్య, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

జాగ్రత్తలతోనే మూగజీవాలకు రక్షణ

- సీజనల్ వ్యాధుల బారిన పశువులు
- చిత్తడితో కాలిపుండు రోగాలు
- పశువైద్యశాలలో వ్యాక్సిన్లు



గొర్రెలకు వ్యాక్సినేషన్ చేస్తున్న పశువైద్యుడు (ఫైల్)

దామరగిద్ద: వర్షాకాలం కావడంతో పశువులు సైతం సీజనల్ వ్యాధుల బారిన పడుతుంటాయి. మండలంలో అనేక మంది రైతులు పశుపోషనే జీవనాధారంగా జీవిస్తున్నారు. ఈ క్రమంలో పశువులకు సీజనల్ వ్యాధులు సోకకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడంతో పశువులను కోల్పోతుంటారు. వర్షాలకు మొలకెత్తిన పశుగ్రాసాన్ని తినడం పుర్రు కొట్టుకోవడం, మేత మేసినా శరీరానికి ఇంకక పోవడం వంటి లక్షణాలతో గొర్రెలు రోగాల బారిన పడుతుంటాయి. పశువైద్యశాఖలో మందులున్న రైతులకు అవగాహణ లేకపోవడమో లేదా అధికారులు అవగాహన కల్పించక పోవడంతో అన్నదాతలు నష్టపోతుంటారు. మండలంలోని 30 గ్రామ పంచాయతీల పరిధిలో తెల్లజాతి పశువులు (ఆవులు, ఎద్దులు) 10895, నల్లజాతి పశువులు (గేదెలు) 3632 ఉన్నాయి. అయితే పలు ముందస్తు జాగ్రత్తలతో పశువులకు వ్యాధులు సోకకుండా కాపాడుకోవచ్చని పశువైద్యులు సూచిస్తున్నారు.

పశువులకు సోకే సీజనల్ వ్యాధులు

చిటుక వ్యాధి: క్లాస్ట్రోడియం జాతికి చెందిన సూక్ష్మ జీవులు ఉత్పత్తి చేసే విష పదార్థాల ద్వారా ఈ వ్యాధి సోకుతుంది. తొలకరి వర్షాలకు పెరిగిన పచ్చి మేత తినడంతో ఈ వ్యాధి వస్తుంది. ఈ వ్యాధి సోకిన గొర్రెలు ఎలాంటి లక్షణాలు లేకుండానే హఠాత్తుగా గాలిలోకి ఎగిరి కిందపడి గిలగిల కొట్టుకొని చనిపోతాయి. వ్యాధి నివారణకు టీకాలు వేయించాలి.

కాలిపుండు వ్యాధి: ఇది గొర్రెలకు సోకుతుంది. గొర్రెలు చిత్తడి నెలలో సంచరించడం వల్ల వ్యాపిస్తుంది. వ్యాధి సోకిన గొర్రెలకు కాళ్ల గిట్టల మధ్య ఎర్రగా కందుతుంది. అనంతరం చీము పట్టి గొర్రెలు నడవలేని స్థితిలో గెంటుతాయి. వ్యాధి సోకిన గొర్రెలను మంద నుంచి వేరు చేసి పొడి ప్రదేశాల్లో నిలపాలి.

నీలినాలుక వ్యాధి: ఈ వ్యాధి వైరస్ వల్ల అలాగే దోమకాటుతో సోకుతుంది. గొర్రెల పెదవులు, చిగుళ్ల వాచి పెదవుల లోపల ఎర్రబడి గుల్లలు ఏర్పడుతాయి. పశువుల పాక అపరిశుభ్రంగా ఉండడం వల్ల ఈ వ్యాధి సోకుతుంది. టీకాలు వేయించి పశువుల పాకను శుభ్రంగా ఉంచాలి.

మందులు బయట కొంటున్నాం

ఏటా వర్షాకాలం వచ్చిందంటే గొర్రెలకు రోగాలు వస్తుంటాయి. పుర్రు రోగంతో మేత మేసినా శరీరానికి ఇంకక పోవడంతో బక్కచిక్కి పోతాయి. పుర్రు నివారణకు ప్రైవేటు మెడికల్ దుకాణాల్లో మందులు తెచ్చి తాపిస్తున్నాం. కొన్నింటికి నయమౌతుంది. కొన్నింటికి తొందరగా నయం కావడం లేదు. ప్రభుత్వ పశువైద్యశాలలో మందులు అందుబాటులో ఉంచాలి.

–కుర్వ చంద్రు, మద్దెల్‌బీడ్

అవగాహన కల్పించాలి

ప్రభుత్వ వైద్యులు గొర్రెలు, ఇతర పశువులకు సోకే సీజనల్ వ్యాధుల పట్ల ముందుగానే అవగాహన కల్పించాలి. అవసరమైన మందులు ప్రభుత్వ పశువుల ఆస్పత్రి ద్వారా అందించి తమ లాంటి యువ రైతులకు ప్రయోజనం కల్పించాలి. పశువుల ఆస్పత్రికి వెళ్తే ఒకటి ఉంటే మరొకటి బయట తెచ్చుకోండి అంటున్నారు. రైతులకు నమ్మకం లేక ప్రైవేటు మందులను వాడుతున్నారు.

–అయ్యలప్ప, రైతు, మద్దెల్‌బీడ్

రైతులు అప్రమత్తంగా ఉండాలి

ప్రస్తుతం ఎడతెరిపిలేని వర్షాలు కురుస్తుండడంతో రైతులు పశువులకు సీజనల్ వ్యాధులు సోకకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యాధుల నివారణకు మందులను పంపిణీ చేస్తున్నాం. గొర్రెలు, మేకల్లో నీలినాలుక, కాలికుంటు తెల్లజాతి పశువుల్లో మృతచర్మ వ్యాధి, పుర్రురోగం ఎక్కువగా వస్తుంటాయి. వ్యాధుల నివారణకు పశువైద్యశాలలో వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టాం.

–శ్రీనివాస్, పశువైద్యాధికారి, దామరగిద్ద

నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి



ధర్నా చేస్తున్న నాయకులు

మక్తల్: మండలంలోని రుద్రసముద్రం గ్రామంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలని అంబేడ్కర్ యువజన సంఘం, మక్తల్ ఎమ్మార్పీఎస్, కేవీపీఎస్, బీఎస్పీ సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు ఆదివారం ధర్నా చేశారు. పోలీసుల నిర్లక్ష్యంతోనే ఈలాంటి ఘటనలు జరుగుతున్నాయని ఆరోపించారు. రాజ్యాంగ నిర్మాతకే రక్షణ లేకుండా పోయిందని, ఇక ప్రజలకు ఎలా రక్షణ కల్పిస్తారని ప్రశ్నించారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలోమానవ హక్కుల పరిరక్షన సమితి సభ్యులు మద్దిలేటి, ప్రధాన కార్యదర్శి కృష్ణ, నాగేష్, అంజయ్య, ఎద్దుల రాములు తదితరులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలపై సమీక్ష



మాట్లాడుతున్న నందు నామాజీ

నారాయణపేట రూరల్ : ఎంతో ప్రఖ్యాతి చెందిన గణేష్ ఉత్సవాలను జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహిద్దామని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నందు నామాజీ పిలుపునిచ్చారు. పట్టణ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పట్టణంలో వినాయకులను ప్రతిష్ఠించే మండప అధ్యక్ష, కార్యదర్శులతో ముందుగా ఉత్సవాలకు సంబంధించిన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల పోలీసులు నిర్వహించిన శాంతి సమావేశంలో ప్రకటించిన డీజే సౌండ్ సిస్టం గురించి అభిప్రాయాలు, సలహాలు, సూచనలు తీసుకున్నారు. అనంతరం వారికి మండపాల్లో అన్ని రకాల సౌకర్యాలు, జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో నగర గణేష్ మండప అధ్యక్ష కార్యదర్శులు, విశ్వహిందూ పరిషత్, బజరంగ్దళ్, హిందూ బంధువులు పాల్గొన్నారు.

కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహిద్దాం

నారాయణపేట రూరల్: కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించుకుందామని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి సురేఖ, కన్న శివకుమార్ పిలుపునిచ్చారు. స్థానిక టీచర్స్ కాలనీ లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ముందుగా శ్రీకృష్ణుని విగ్రహానికి పూజలు చేసి అనంతరం మాట్లాడారు. ఈనెల 20వ తేదీ వరకు ప్రతి బస్తీలో, గ్రామ గ్రామాన విశ్వహిందూ పరిషత్ స్థాపక దినోత్సవం నిర్వహించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ శ్రీకృష్ణుని మహత్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు, మహిళలు, పరిషభ కార్యకర్తలు, దుర్గా వాహిని సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలుచేయాలి

అమరచింత : రాష్ట్రంలో 42 శాతం రిజర్వేషన్లను బీసీలకు అమలు చేయాలంటూ ఆదివారం మండలకేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో చట్టం తీసుకురావాలని, 9వ షెడ్యూల్‌లో చేర్చాలని బీసీలకు సంబంధించిన రిజర్వేషన్లు మైనార్టీలు పొందకూడదని అక్రమ పద్ధతుల్లో బీజేపీ నాటకం ఆడుతుందన్నారు. ముస్లింలలో దూదేకుల తదితర అట్టడుగు తరగతుల వారున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి జీఎస్.గోపి, వెంకటేష్, రమేష్ ,అజయ్ తదితరులు పాల్గొన్నారు.

కుంటల తూములకు లాకులు ఏర్పాటు చేస్తాం

అమరచింత: పట్టణ శివారులోని నాగులకుంట, ఆనాయికుంట తూంలకు వెంటనే లాకులు ఏర్పాటు చేసి నీటి వృథాను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ ఏఈ ఆంజనేయులు అన్నారు. ఆదివారం అనాయికుంట, నాగుల కుంటలను సందర్శించి తూంల నుంచి నీరు వృథా అవుతున్న తీరును పరిశీలించారు. ఈ మేరకు అక్కడి రైతులతో మాట్లాడారు. కుంటలలో నీరు నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను రైతులు కోరారు. ప్రస్తుతం లాక్‌లను ఏర్పాటు చేయడానికి బడ్జెట్ లేదని చెప్పడంతో రైతులు తామే విరాళాలు సేకరించి ఇస్తామని బదులిచ్చారు. దీంతో త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామన్నారు.

అంధకారం.. కావాలి అప్రమత్తం



మండలంలోని పెద్దవాగుపై జాతీయ రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు వెలగక ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గత డిసెంబర్‌లో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయగా కేవలం ఐదు రోజులు మాత్రమే వెలిగి తర్వాత వెలగలేదని స్థానికులు పేర్కొంటున్నారు. జాతీయ రహదారి కావడంతో వందల సంఖ్యలో వాహనాలు ప్రయాణం సాగిస్తుండటంతో కొత్తగా వచ్చే వారు చీకటి కారణంగా ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే లైట్లకు మరమ్మతు చేపట్టాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు. - మాగనూర్

యాదవ జవాన్ల వీరత్వాన్ని గుర్తించాలి

దామరగిద్ద: చైనా సరిహద్దుల్లో వీరోచిత పోరాటంతో అసువులు బాసిని యాదవ జవాన్ల వీరత్వాన్ని భారత ప్రభుత్వం గుర్తించాలని మండల యాదవ సంఘం నాయకులు వెంకటయ్య, అంజప్ప, శ్రీనివాస్‌లు అన్నారు. భారత్–చైనా సరిహద్దులో ఆహిర్ రెజిమెంట్ అవసరాన్ని గర్తించాలని కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు చేపట్టిన కళశ యాత్ర ఆదివారం నారాయణపేట జిల్లాలో అలాగే రాష్ట్రంలోకి ప్రవేశించడంతో నాయకులు ఘన స్వాగతం పలికేందుకు నారాయణపేటకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ సేవలో జవాన్ల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో అఖిల భారత యాదవ సంఘ నాయకులు రాములు, వెంకటేష్, వెంకటయ్య శ్రీనివాస్ పాల్గొన్నారు.

కలశయాత్రకు ఘన స్వాగతం



మరికల్: అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో నిర్వహించిన రేజంగ్ లా రజ్ కలశ యాత్ర ఆదివారం మరికల్‌కు చేరుకుంది. నారాయణపేట నుంచి ప్రారంభమైన ఈ యాత్ర మరికల్‌కు రాగానే యాదవ సంఘం నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం యాత్రలో పాల్గొన్న ప్రముఖులను సన్మానించారు. కార్యక్రమంలో కృష్ణయ్య, రాజేష్, ఆంజనేయులు, నరేష్, రఘు, మురళీ, తిరుపతయ్య పాల్గొన్నారు.

వీరభద్ర స్వామి ఆలయానికి పాదయాత్ర



మరికల్: కోయిల్‌కొండలో కొలువు దీరిన వీరభద్ర స్వామి ఉత్సవాలు సోమవారం ఘనంగా జరగనున్నాయి. ఈ క్రమంలో ఉత్సవాలకు ఆదివారం మరికల్ నుంచి భక్తులు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. ఉత్సవాలకు విచ్చేసే భక్తుల సౌకర్యార్థం ఆలయంలో నిత్య అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యుడు శివకుమార్ తెలిపారు.ఈ క్రమంలో శివకుమార్ ఆధ్వర్యంలో భక్త బృందం ఉత్సవాలకు తరలివెళ్లారు.

టీచర్, ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్‌ప్రాథమిక పాఠశాలలో ఇటీవల ప్రీ ప్రైమరీ ఈ స్కూల్‌లో టీచర్, ఆయాగా పనిచేసేందుకు ఒప్పంద ప్రాతిపదికన దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హెచ్ఎం రామకృష్ణా తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ టీచర్‌కు రూ.8వేలు ఆయాకు రూ.6వేలు వేతనం ఉంటుందన్నారు. టీచర్‌కు కనీస విద్యార్హత ఇంటర్ ఆపై చదివి ఉండాలని, ఆయాకు కనీసం 7వ తరగతి చదివి ఉండాలన్నారు. ఎంపిక కలెక్టర్ ఆధ్వర్యంలో జరుగుతుందని స్థానికులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

మాగనూర్ పెద్దవాగుకు వరద ఉధృతి



అడవి సత్యారంలో ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్దవాగు

మాగనూర్: మండలంలోని సంగం బండ చిట్టెం నర్సిరెడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ మూడు గేట్లు ఎత్తి దిగువకు నీరు వదలడంతో మాగనూర్ పెద్దవాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. వరద అడవిసత్యారం వంతెన పైనుంచి ప్రవహిస్తుండడంతో అడవిసత్యారం, కొల్పూర్, మందిపల్లి, గజ్జరందొడ్డి, పూంజనూర్ గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. వర్షాకాలంలో అధిక వర్షాలు కురిసినప్పుడల్లా రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అడవిసత్యారం వంతెన ఎత్తును పెంచి ఈ సమస్యకు శాస్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు. ప్రస్తుతం ఆగస్టులోనే చెరువుకు జలకళ రావడంతో చెరువు కింద రైతులు పంటల సాగులో నిమగ్నమయ్యారు.



ఘాట్‌ను తాకిన వరద నీరు

పస్పుల ఘాట్‌ను తాకిన వరద

మక్తల్: రెండు, మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు కృష్ణా నది వరద పస్పుల ఘాట్‌ను తాకింది. ఎగువన కర్ణాటకలో భారీ వర్షాలు కురుస్తుండడంతో తుంగభద్ర డ్యాం గేట్లు ఎత్తు నీటిని దిగువకు వదలడంతో జిల్లాలోని కృష్ణా నదికి చేరుకుంది. కృష్ణా నదిలో నీటి మట్టం పెరగడంతో పస్పుల దగ్గర ఉన్న రెండు పాయాల్లో వరద నీరు అధికంగా ప్రవహిస్తుంది. కృష్ణా నదిలో నీటి మట్టం పెరగడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

ఘనంగా ఆంజనేయస్వామి వార్షికోత్సవం



ఆలయంలో వార్షికోత్సవ పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మరికల్: మండల కేంద్రంలో కొలువుదీరిన పడమటి ఆంజనేయస్వామి 3వ వార్షికోత్సవ పూజ కార్యక్రమాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ కాంతులు, పూలతో అలంకరించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు భజనలతో పల్లకిసేవ నిర్వహించి, స్వామివారికి అభిషేక సహిత, సామూహిక, ఆకుల పూజలు చేశారు. అనంతరం అఖండ భజన కార్యక్రమాలను నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో పూజరి వెంకటేశ్వర్లశర్మ, కమిటి సభ్యులు జగన్, రాజేశ్వర్‌రెడ్డి, కృష్ణయ్య, రాంచంద్రయ్యగౌడ్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆరాధన ఉత్సవాలు ప్రారంభం



అలంకరణలో రాఘవేంద్ర స్వామి

నారాయణపేట రూరల్ : పట్టణంలోని శ్రీ రాఘవేంద్ర స్వామి ఆలయంలో ఆదివారం 354వ ఆరాధన ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వేడుకల్లో భాగంగా స్వామివారికి సుప్రభాతం, నిర్మల్యం , పంచామృతాభిషేకం, భజన పల్లకి సేవ, సర్వసేవ, అలంకార పంక్తి, మహా నైవేద్యం తదితర ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అర్చకులు జోషి రఘుప్రేమాచారి ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. రాఘవేంద్ర స్వామిని కొలిచిన వారికి కొంగుబంగారంగా నిలుస్తున్నారన్నారు స్వామివారి సేవలో ప్రతి ఒక్కరు ధన్యులు కావాలన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు నరసింహ చారి, అనిల్ దేశాయి, సేవా సమితి సభ్యులు శ్రీపాద, విజి కులకర్ణి, నరసింహ, శేషు, భీమ్సే నరావు, అనిరుద్ధ, ధరణిధర్, గురురాజ్ రాఘవేంద్ర, శ్రీహరి, ప్రహల్లాద, మంజునాథ్ జోషి మూర్తి, నారాయణరావు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా అఖండ జ్యోతుల ఊరేగింపు



అఖండ జ్యోతుల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

నారాయణపేట రూరల్/మద్దూర్: బ్రహ్మణ్ వాడి తొగట వీరక్షత్రియ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నారాయణపేట, మద్దూర్‌లో చౌడేశ్వరి మాత అఖండ జ్యోతుల ఊరేగింపును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణ పురవీధుల మీదుగా భజన సంకీర్తనలతో ఖడ్గ విన్యాసాలతో నందికోలు ఆటలతో ముందుకు కదిలారు. అంతకుముందు అమ్మవారి మూల విరాట్ విగ్రహానికి మహాభిషేకం , కుంకుమార్చన, పుష్పాలంకరణ, ప్రత్యేక పూజలతో పాటు మహా మంగళహారతి, సర్వదర్శనం, తీర్థ ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో వీర క్షత్రియులు బాల్‌రాజ్, రమేష్, రామకృష్ణ, మహదేవ్, విఠల్, రథేష్, బిచ్చయ్య, నర్సిములు, రాము, రవి, బాల్‌రాజ్, రామకృష్ణ పాల్గొన్నారు.

కేఎల్ఐ.. రికార్డు బ్రేక్!



ఎల్లూరు పంప్‌హౌజ్ నుంచి నీటి ఎత్తిపోతలు

కొల్లాపూర్: ఉమ్మడి పాలమూరు జిల్లా వరప్రదాయిని కేఎల్ఐ ప్రాజెక్టు నీటి ఎత్తిపోతలలో రికార్డు సృష్టిస్తోంది. కృష్ణానదికి వరద ప్రారంభమైన కొన్ని రోజుల్లోనే 4 టీఎంసీల నీటిని ఎత్తిపోసి గత రికార్డుకు బ్రేక్ వేసింది. 2011లో కేఎల్ఐ ద్వారా ఎత్తిపోతలు ప్రారంభం కాగా.. నాటి నుంచి అవిశ్రాంతంగా మోటార్లు పనిచేస్తున్నాయి. కొన్నేళ్ల క్రితం ప్రాజెక్టు మొదటి పంపుహౌజ్‌లో రెండు మోటార్లు పాడవడంతో మిగిలిన మూడు మోటార్లతోనే నీటిని ఎత్తిపోస్తూ ప్రాజెక్టు అధికారులు రికార్డు సృష్టిస్తున్నారు.

పనితీరు ఇలా..

కేఎల్ఐ పరిధిలో ఎల్లూరు, జొన్నలబొగుడ, గుడిపల్లి గట్టు పంప్‌హౌజ్‌లు ఉన్నాయి. ఒక్కో పంపుహౌజ్‌లో 5 మోటార్ల చొప్పున ఏర్పాటు చేశారు. వీటిలో 4 మోటార్లు రెగ్యులర్ పంపింగ్ కోసం, ఒక మోటార్ స్పేర్‌లో ఉంచేందుకు నిర్ణయించారు. 30 మెగావాట్ల సామర్థ్యం గల ఒక్కో మోటార్ ద్వారా రోజూ 800 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తారు. కేఎల్ఐ ద్వారా కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, అచ్చంపేట, కల్వకుర్తి నియోజకవర్గాల్లోని ఆయకట్టు భూములకు సాగునీరు అందుతోంది.

మిషన్ భగీరథకు సైతం..

ఉమ్మడి మహబూబ్‌నగర్‌తోపాటు రంగారెడ్డి జిల్లాలోని పలు మండలాలకు తాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ పథకానికి కూడా కేఎల్ఐ ద్వారానే నీటి ఎత్తిపోతలు సాగుతున్నాయి. ఎల్లూరు సమీపంలోనే మిషన్ భగీరథ స్కీం ఏర్పాటు చేశారు. ఇక్కడి నుంచే అన్ని ప్రాంతాలకు తాగునీరు సరఫరా అవుతోంది. ప్రతి సంవత్సరం మిషన్ భగీరథ కోసం 7 టీఎంసీల నీటిని వినియోగిస్తున్నారు.

మోటార్లపై భారం..

ఎల్లూరు పంప్‌హౌజ్‌లో ఐదు మోటార్లకు గాను ప్రస్తుతం మూడు మోటార్లు మాత్రమే పనిచేస్తున్నాయి. 2011లో కేఎల్ఐ ద్వారా నీటి ఎత్తిపోతలు ప్రారంభమైన సమయంలో ఐదు మోటార్ల ద్వారా 0.0086 టీఎంసీ నీటిని మాత్రమే ఎత్తిపోశారు. 2015 వరకు ప్రతి సంవత్సరం 2.5 టీఎంసీల లోపు మాత్రమే ఎత్తిపోతలు జరిగాయి. 2016 నుంచి నీటి పంపింగ్ శాతం భారీగా పెరుగుతూ వచ్చింది. మూడు మోటార్లతోనే రికార్డు స్థాయిలో పంపింగ్ జరుగుతోంది. సాగు, తాగునీటికి కేఎల్ఐ ప్రాజెక్టే దిక్కవడంతో మోటార్లపై పంపింగ్ భారం పెరుగుతోంది. నీటి పంపింగ్ రికార్డు స్థాయిలో జరుగుతోందని ఓవైపు ఆనందపడుతున్న అధికారులు.. మరోవైపు మోటార్లపై భారం పెరుగుతోందని ఆందోళన

ఇదీ ప్రాజెక్టు చరిత్ర..

కొల్లాపూర్ మండలం ఎల్లూరు సమీపంలోని కోతిగుండు వద్ద నుంచి కృష్ణా బ్యాక్‌వాటర్‌ను వినియోగించుకునేలా కల్వకుర్తి లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మించారు. 1998లో ప్రాజెక్టు నిర్మాణానికి సర్వే చేపట్టగా.. 2003లో పనులు ప్రారంభమయ్యాయి. 2.50లక్షల ఎకరాల ఆయకట్టు సాగుకు 25 టీఎంసీల నీటిని ఎత్తిపోసేలా డిజైన్ రూపొందించారు. 2005లో ఆయకట్టు విస్తీర్ణాన్ని 3.40 లక్షలకు పెంచారు. 2011లో ఈ ప్రాజెక్టు ద్వారా నీటి ఎత్తిపోతలు ప్రారంభమయ్యాయి. ఎల్లూరు పంప్‌హౌజ్‌లోని 5 మోటార్ల ద్వారా రిజర్వాయర్‌లోకి నీటిని ఎత్తిపోసి.. అక్కడి నుంచి సింగోటం, జొన్నలబొగుడ, గుడిపల్లిగట్టు రిజర్వాయర్లకు పంపింగ్ చేస్తున్నారు. 2016లో ప్రాజెక్టుకు 40 టీఎంసీల నీటి కేటాయింపులు జరిగాయి. దీంతో ఆయకట్టు విస్తీర్ణాన్ని 4.24 లక్షల ఎకరాలకు పెంచారు.